

# మబ్బుల్లో..

'రావూ'

## 1

మద్రాసులో ఏ బస్‌స్టాప్‌దగ్గిరైనా నిలబడు, నువు ఎక్కదలుచుకున్న నంబరు బస్సు తప్ప మిగతానంబర్ల బస్సులన్నీ వస్తాయి. ఈ విషయం మద్రాసు బస్సుప్రయాణీకులందరికీ తెలుసు. ఇందువల్ల ఒక సౌకర్యంవుంది—నీకు బస్సు దొరికేలోపల మద్రాసులో అయిదోవంతో, ఆరోవంతో నీ పక్కగా పోతుంది; మద్రాసుపేటలు రెండుమూడింటిని చుట్టపెట్టితే ఎంతమందినైతే చూడగలుగుతామో, బస్సుకోసం వేచివుండే సమయంలో అంతమందినీ చూడగలుగుతాం. యుద్ధానంతరం మద్రాసులో రోడ్డుప్రయాణీకుల ఒత్తిడి హెచ్చటంవల్ల ఏర్పడిన గొప్ప ఏర్పాటు యిదొకటీ.

ఈ ఏర్పాటే లేకపోతే మూడేళ్ళక్రితం నేను పానగల్ పార్క బస్‌స్టాప్‌దగ్గిర శివయ్యగారిని కలుసుకునేవుండను. పదమూడోనంబరుబస్సు పట్టుకుని ట్రిప్లికేన్ హైక్రాఫ్ట్స్‌రోడ్డు పోదామని నా సంకల్పం. కాని తొమ్మిదినంబరు బస్సులు మూడూ, పదినంబరు బస్సులు రెండూ, పన్నెండునంబరు బస్సులు రెండూ, పదకొండునంబరు బస్సులు రెండూ వెళ్ళినా పదమూడునంబరు బస్సుమటుకు కళ్ళపడలేదు. దానికోసం వెయ్యికళ్ళతో చూస్తూన్న నాకు శివయ్యగారి నిండువిగ్రహం పానగల్‌పార్కు మలుపుతిరిగివస్తూ కనిపించింది.

"ఏమిటిది? మావూరి శివయ్యగారే? ఛా? నిజంగా? ఎంతచిత్రం?" అనుకున్నాను. చెప్పొద్దు, నాకాయన్ను చూసి పదమూడు బస్సు చూసినదానికన్న యెక్కువ ఆనందమే కలిగింది. ఎందుకంటారా? ఒకప్పుడు నేనాయన్ని స్టేజిమీదచూసి, "ఇంతకన్న గొప్పయాక్టరుండడు," అనుకున్నవాణ్ణి. ఈ అభిప్రాయం రానురాను మారినప్పటికీ ఆయనందు చిన్నతనంలో ఏర్పడ్డ ఆ గురిమాత్రం అట్లాగే నిలిచిపోయింది. నేను చదువు పూర్తిచేసి మావూరి పౌరులలో ఒకణ్ణి అనిపించుకునేకాలంలో నాకు శివయ్యగారి పరిచయం లభించినప్పుడుకూడా ఆయనమీద చిన్నతనంలో నాకుండిన "గ్లామర్" ఏమాత్రమూ మాయలేదు. ఆయనతో మాట్లాడటమే మహాభాగ్యం అనుకున్న నాకు ఆయనతో కలుపుగోలుగా మాట్లాడే అదృష్టం కలిగిందిగదా అని గర్వించానుకూడా. ఆతరవాత ప్రపంచానికీ, మావూరికీ, నాకూ అనేక వింతఅనుభవాలు జరిగాయనుకోండి. నేను మావూరికే కాకుండాపోయి మద్రాసు చేరుకుని వుద్యోగం సంపాదించుకుని, మద్రాసులో ఇళ్ళుగలవాళ్ళకూ, హోటళ్ళకూ, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలవాళ్ళకూ, సిగిరెట్టుకొట్లవాళ్ళకూ లాభాలు చేకూర్చటానికి ఉడతాభక్తిగా తోడ్పడుతూ వస్తున్నాను. ఇవాళ ఈ శివయ్యగారిని చూడగానే ఒక్కసారిగా మళ్ళీ మావూరు చూసుకున్నట్టయింది.

మద్రాసులో మన ప్రాంతంవాడెవడన్నా కనిపిస్తే కాస్త శ్రద్ధగాచూడండి. వాడు మద్రాసుకువచ్చాడో, మద్రాసుకు వచ్చిపడ్డాడో ఇట్టే తెలిసిపోతుంది. ఏదన్నా పనిమీద మద్రాసుకు వచ్చినవాడు మసలుకునేపద్ధతి ఆయోమయంగా ఉండదు. వాడు అవసరమైనవైపే చూస్తాడు, పనివున్నవైపే కదులుతాడు. తనకు కావల్సిన బస్సు పట్టుకుంటాడు, తన గమ్యస్థానంలో దిగిపోయి, వెంటనే రిక్షాకోసం చూస్తాడు, లేదా నడకపుచ్చుకుంటాడు, లేదా దర్జాగా టాక్సీ "చేయించుకుంటాడు." వాణ్ణిచూస్తేనే పనిమీదవున్నాడని తెలిసిపోతూంటుంది. మద్రాసుకువచ్చిపడ్డవాడు అట్లాకాదు. అసలు వాడి చూపులే శూన్యంగా ఉంటాయి. రోడ్డుపక్క పేవ్‌మెంట్‌మీద నడుస్తూ పోతూంటే తానెక్కడికి పోతున్నదీ తనకే తెలియనట్టూ, తనకొక గమ్యస్థానమంటూ లేనట్టూ ఉంటాడు. నడుస్తూ నడుస్తూ

ఆగి ఏమేడకేసో, ఏదుకాణంకేసో అర్థంలేకుండా చూస్తాడు—తనకు అంతకంటె ముఖ్యమైనపని ఏమీలేదని స్పష్టం చేస్తూ. ఈ అభాగ్యుడు ఏబస్సుస్టాండు దగ్గరైనా నిలబడి నప్పటికీ వచ్చేపొయ్యే బస్సులకేసి శూన్యంగా చూస్తాడు. ఏదో బస్సుచూసి ఎక్కబోయేవాడల్లే కదులుతాడు. రెండడుగులువేసి ఆగుతాడు, ఎందుకో వెనక్కు తగ్గుతాడు. లేదా, బస్సువచ్చి ఆగినప్పుడు దానికేసిచూడడు. అందులోనుంచి జనం దిగి అందులోకి జనం ఎక్కి తీరా అది బయలుదేరబోయే సమయానికి, అప్పుడే నిద్రమేలుకున్నవాడిలాగా ఒక్కవురుకుతీస్తాడు. అది అందకపోతే నిర్లిప్తమైన మొహంపెట్టి ఎటో నడిచిపోతాడు. ఒకవేళ ఇంకా అక్కడే నిలబడినా మళ్ళీ అదేనంబరు బస్సువస్తే దానికేసిచూడడు, అందులో ఎక్కటానికి ప్రయత్నమైనాచెయ్యడు. ఇదే పానగల్‌పార్క్ బస్‌స్టాప్‌దగ్గిర నేనీరకంవాళ్ళను చాలా మందిని చూశాను. ఒకడు మూడు తొమ్మిది బస్సులను ఖాళీగాపోనిచ్చి నాలుగోదానిలోకి తోసుకు ఎక్కటం నేను కళ్ళారా చూశాను. (ఆనాడుకూడా నేను పదమూడు నంబరు ట్రిప్లికేన్ బస్సుకోసమే నిలబడ్డాను.) మరొకడు ట్రిప్లికేన్‌లో ఫలానిచోటికి పోవటానికి పన్నెండు నంబరు బస్సెక్కితే దగ్గిరా, పదమూడు నంబరు బస్సెక్కితే దగ్గిరా అని అడిగి, నాచేత బోలెడంత నోటిలెక్క చేయించి, నాచేత పన్నెండెక్కితేనే దగ్గిర అని చెప్పించుకుని నే చూస్తుండగానే తొమ్మిదినంబరు బస్సెక్కి, నేనువింటుండగానే కండక్టర్ను పంచవటికి టిక్కెట్టెంత అని అడిగాడు.

శివయ్యగారు మద్రాసుకు వచ్చిపడ్డమనిషిలాగా కనిపించాడు. ఆయన నడకలో ఏమీ చురుకులేదు. చూపులో శూన్యత్వం కనిపిస్తున్నది. తాను ఫలానా అనిగాని, ఫలానిచోటినుంచి వస్తున్నాననిగాని, ఫలానిచోటికి వెళుతున్నాననిగాని ఆయనకు ఆక్షణాన తెలిసినట్టుగా నాకు తోచలేదు.

## 2

"ఏమండోయ్, శివయ్యగారూ? ఏమిటిది?" అని పలకరించాను.



శివయ్యగారు ఆగాడు, అటూ ఇటూ చూసి చివరకు నన్ను తనకళ్ళతో పట్టుకున్నాడు.

"ఓహో! ఆహా! ఆఁ? ఆఁ? నువ్వేనా?'' అన్నాడు శివయ్యగారు ప్రపంచంలోపడుతూ.

"ఎప్పుడు రావటం?" అన్నాను.

"నేనా? నేనొచ్చిఅప్పుడే—మొన్నా—మొన్న ఎందు కయిందీ? అంటే మొన్నరాత్రి మెయిలుకనుకో—నిన్న ఉదయం దిగానన్నమాట.''

పదమూడోనంబరు బస్సులు ఒకదానివెంట ఇంకొకటిగా వచ్చాయి. కాని ఏంచెయ్యనూ?

"ఏమిటి మనవూరి విశేషాలు?'' అన్నాను.

''ఆఁ, విశేషాలేమున్నై? ఏమీలేవు. అయితే నువ్విక్కడుంటున్నావుగాదూ? బాగుంది. ఉద్యోగమా? అవునులే. లేకపోతే ఇక్కడెందుకూ వుండటం? చూడు, మన రంగయ్యగారబ్బాయి జానకిరాముడేదో సినిమాకంపెనీలో వుంటున్నాడన్నారే? నీకేమైనా తెలుసా? నీకు వాడు మనిషే తెలీదా? సారిపోయింది!''

"ఇంతకీ మీరెక్కడ మకాంపెట్టారు?" అని అడిగాను.

"అదే ఇంకాకుదరలా. ప్రస్తుతానికి బెడ్డింగు రాజేశ్వర్రావుగారింట్లో పారేశా. ఇట్లా తిరుగుతున్నా."

శివయ్యగారికి మద్రాసురావలసిన పనేమీలేదన్న అనుమానం నాలో దృఢం కాసాగింది. అది నిజమోకాదో తేల్చుకోవాలంటే, "మీరేంపనిమీద వచ్చారు?' అని అడగాలి. పెద్దవాణ్ణి అట్లా అడగటం బాగుండదు.

"ఇంతకీ మీరువచ్చినపని అయిందా? నాలుగురోజులుంటున్నారా?" అన్నాను.

"ఆఁ, పెద్దపనేముందీ? నేను వేరే వొకందుకు—ఒక వుద్దేశంతో వచ్చాలే. సావకాశంగాచెబుతా. ఇట్లాచెబితే తేలదు. నీ సలహాకూడా కావాలి. నువ్వుండేదెక్కడా?"

నా ఎడ్రసు కాకితంముక్కమీద రాసియిచ్చా. శివయ్యగారు దాన్ని జాగ్రత్తగామడిచి జేబులో పెట్టుకున్నాడు.

"కాస్త కాఫీతాగుదామా? ఈపక్కనే హోటలుంది,'' అన్నాను.

మొహమోటానికి కూడనిపని చేసేవాడిలాగా నవ్వి, "పోనీ పద," అన్నాడు.

కాఫీహోటలు ఫాన్‌కిందకూచుని ఫలహారానికి ఆర్డరిచ్చినమీదట శివయ్యగారు తన మద్రాసురాకగురించి కొంత బయటపెట్టాడు. ఆయన ఆర్థికపరిస్థితి ఏమీ బాగాలేదుట. ఇన్నేళ్ళుగా నాట్యకళను ఆరాధించి, దానికోసం తన సర్వస్వాన్నీ ధారపోసి, ఇప్పుడు తనను తలపోసేవారెవరూ లేరనీ, తనతోపోల్చటానికే వీల్లేనివాళ్ళంతా హేమాహేమీలై కూర్చున్నారనీ, ఆంధ్రజాతీ, నాట్యకళా, భగవంతుడు ఏకమై తనకు తీరని అన్యాయం చేశారనీ అన్నాడు ఆయన.

నాకుచూడగా శివయ్యగారు మబ్బులో ఉన్నట్టుగా కనిపించాడు. వంచన అనటం నాకిష్టంలేదుగాని, ఆత్మవంచనే అయినప్పటికీ ఆయనధోరణివల్ల ఆయనకు కొంచెమైనా ఉపకారం జరగదని నాకుతోచింది. ఈయన కిప్పుడున్న నలభై అయిదు, నలభై ఆరేళ్ళలో ఒక ఇరవై స్టేజీమీద గడిచినమాట నిజమే. దాన్ని ఇప్పుడు నాట్యకళారాధన కింద ఈయన జమకడుతున్నాడుగాని దానికి ఇతరులు—ఆయనపట్ల సానుభూతి లేనివారు—ఇంకో పేరుపెట్టగా నేను విన్నాను. నాటకాలకోసం ఈయన కొంతడబ్బు తగలేసినమాటకూడా నిజమే. కాని ఆంధ్రలోవున్న ప్రతి పెద్ద స్టేజినటుడూ ఎప్పుడో ఒకప్పుడు ఈయనకోసం బెనిఫిట్ నాటకాలాడారు. చాలామంది మధ్యతరగతి వాళ్ళలాగే ఈయన ఆర్థికంగా దెబ్బతిన్నది డిప్రెషన్‌లో.

స్టేజిమీద ఈయనకు బొత్తిగా స్థానం లేకుండాపోయిన అనంతరం ఈయన ఒక సినిమా కంపెనీకూడా పెట్టటానికి యత్నించాడు. కాని అది జరగలేదు, జరుగుతుందని ఎవరూ అనుకోలేదు. మద్రాసువచ్చాడు. అడ్వొకేట్ రాజేశ్వర్రావుగారింటో పక్కపారేసి మద్రాసంతా తిరుగుతున్నాడు.

"నాకేంకావాలి? పగలల్లా తిరుగుతా. ఎక్కడ వీలయితే అక్కడే భోంచేస్తా. రాత్రికిపోయి రాజేశ్వర్రావింటో, వాళ్ల ఆఫీసు గదిలోనే పడుకుంటా. అక్కడ భోజనమంటూ పెట్టుకుంటే వాళ్ళకీ ఇబ్బంది, మనకూ ఇబ్బంది. మనకోసం వాళ్ళు కాచుకోవటం, వాళ్ళవీలు ఎట్లావుండేదీ తెలీక మనం పని పాడుచేసుకోవటం—ఎందుకిదంతా? ఏమంటావ్?" అన్నాడాయన.

నేను తలఊపాను. రాజేశ్వర్రావుగారింట శివయ్యగారికి పెద్దపెట్టున ఆతిథ్యం లభించలేదని నాకర్థమయింది.

"ఇంతకూ అసలు సంగతేమంటే ఊరికే కూచో బుద్ధి పుట్టటంలేదోయ్. అలవాటైన ప్రాణమంటారు చూడూ? అట్లావుంది నాపని. మళ్ళీ నాటకకంపెనీ పెట్టమని చాలా మంది సలహా ఇచ్చారుగాని, ఏకంగా సినిమాకంపెనీయే పెట్టేద్దామనివుంది. ఏమంటావ్? నీ సలహాఏమిటి?—"

"చాలా కంపెనీలు పెడుతున్నారు," అన్నాను.

"ఎవరు? ఏమీతెలీనివాళ్ళు! మనపాటి పరపతికూడా లేనివాళ్ళు! రాజేశ్వర్రావే అన్నాడే—'మిమ్మల్నెరగని వాళ్ళెవరండీ? మిమ్మల్ని ఎరిగినవాళ్ళంతా తలో రూపాయి వేసినా అవలీలగా లక్ష వసూలవుతుంది,' అన్నాడు రాజేశ్వర్రావు. శివయ్య నవ్వాడు. "అంతదాకా అవసరం లేదనుకో. రాజేశ్వర్రావంటివాళ్ళు నలుగురు పూనుకుంటే లక్షరూపాయలు పోగవుతయ్యని నాకు గట్టినమ్మకం వుంది మరి. తరవాత ఏమవుతుందో, సరే, అవసరమైతే సహాయంచెయ్యటానికి మీరంతా ఉన్నారుగా!"

నేనాయన్ని నిరుత్సాహపరచలేను. నాకెందుకో ఈయన కలలుకంటున్నా డనిపించింది. నూటికి తొంభైతొమ్మిది మంది జారిపడేమార్గాన ఈయన పరుగులు తీస్తాడంటే నమ్మటంఎట్లా? ఆయన్నుచూస్తే ఏమో జాలివేసింది. హోటలు బిల్లు ఆయనను ఇవ్వనీయకుండా నేనే ఇచ్చి ఆయనతో మళ్ళా బస్సుస్టాండు చేరుకున్నాను.

"మీరెటు వెళ్ళుతున్నారు?" అన్నాను.

"నేనిట్లాపోతాలే. మళ్ళా కలుసుకుందాం," అంటూ శివయ్యగారు, నాకు కనిపించినప్పుడు పోతున్నదిక్కు కాకుండా దానికెదురుగా, మాంబళం బస్‌టెర్మినస్‌వేపు వెళ్ళిపోయాడు!

## 3

తరవాత పది పదిహేను రోజులకు తంబుచెట్టివీధిలో ఒక హోటల్లో మధ్యాన్నంవేళ నాకు రాజేశ్వర్రావుగారు తటస్థపడ్డాడు. అదీఇదీ మాట్లాడినతరవాత ఆయన అకస్మాత్తుగా, "ఏమిటండీ? మీరంతాకలిసి సినిమాకంపెనీ పెడతారటగా?" అన్నాడు. ఆయనధోరణిలో వెటకారం కనిపించింది.

"ఎవరంతా? ఎవరన్నారు?" అని అడిగాను.

"శివయ్యగారు చెబుతున్నాడుగా? చాలామంది ప్రోత్సహించారుట. మీరు మరీ ప్రోత్సాహం ఇచ్చారుట!"

నాకు ఆశ్చర్యంవేసింది. నేనిచ్చినదే శివయ్యగారికి ప్రోత్సాహమైతే నాకన్న తక్కువగా ఆయనకు ఇతరులిచ్చినది ఏమైవుంటుంది? మళ్ళీ నాకు మబ్బులు జ్ఞాపకంవచ్చాయి.

"నాకాయన ఒకసారే తలవనితలంపుగా కలిశారు. ఆయన ఇంకా మీయింటోనే ఉంటున్నారా?" అన్నాను.

"ఆయనెక్కడికిపోతాడు?" అన్నాడు రాజేశ్వర్రావుగారు, శివయ్యనిపెట్టి పోషిస్తున్నవాడి పోజుపెట్టి.

నాకు శివయ్యమీద జాలీ, ఈ రాజేశ్వరరావుమీద మంటా ఏకకాలమందే కలిగాయి. ఇన్నాళ్ళుబతికి ఇంటివెనక చచ్చినట్టు ఈ శివయ్యగారు ఇటువంటి భ్రష్టుడివగ్గిర తల దాచుకోవటం దేనికి? వెధవ పుస్తకాలవాసనకొట్టే తన ఆఫీసు గదిలో పడుకోనిస్తున్నందుకుగాను తననుగురించి యీ ప్రాక్టీసులేని ప్లీడరు ఇంత తేలికగా మాట్లాడేఅవకాశం ఇవ్వటం దేనికి? రాజేశ్వర్రావు దృష్టిలో శివయ్యగారులోకువయింది—డబ్బుసహాయం పుచ్చుకునికాదు, తన మబ్బులో ఆలోచనలు బయటపెట్టి. నేనుకూడా ఈ రాజేశ్వర్రావులాటి మనిషినే అయితే ఆనాడే—ఆ పానగల్ పార్కుదగ్గిర కలుసుకుని ఆయనకింత కాఫీపోయించిన క్షణంనుంచే—ఆయననుగురించి అందరియెదటా వెటకారంగా, తేలికగా మాట్లాడివుండవచ్చు. తప్పు శివయ్యదే.

"మీరుకూడా శివయ్యగారికి ప్రోత్సాహం ఇస్తున్నారుటగా? ఆయన్నెరిగినవాళ్ళంతా తలా ఒకరూపాయి వేసుకుంటే లక్ష అవుతయ్యన్నారుట?" అన్నాను.

రాజేశ్వర్రావు నావంక క్షణంపాటు వింతగాచూసి చాలాబిగ్గిరిగా నవ్వసాగాడు. హోటల్లో తింటున్నవారంతా మాకేసి చూడసాగారు. రాజేశ్వర్రావు యెంతకీ నవ్వు సంబాళించుకోలేక పోయినాడు. చివరికి దగ్గి, కళ్ళు తుడుచుకుని, ముక్కుచీదుకుని, "ఇంతకన్న వెర్రిబ్రాహ్మడుంటాడా? ఆమాటకూడా నిజమనుకున్నాడన్నమాట! ఈరోజుల్లో ఈయనపేరు స్మరించే వాళ్ళెవరుంటారండీ? యెంత ఫూల్!" అన్నాడు.

ఈ ప్లీడరుగారు శివయ్యగారినిగురించి తేలికగా మాట్లాడుతున్నాడే అని బాధపడ్డాను తప్ప ఆయన అన్నమాట అబద్ధంకాదని నాకుతెలుసు. ఈసారి నాకు శివయ్యగారు తటస్థపడితే, ఈ రాజేశ్వరరావు ఇంటినుంచి పక్క-

చుట్ట తీసుకుని మరెక్కడికైనా పొమ్మనీ, ఈ సినిమా కంపెనీగొడవ మానమనీ సలహా యిద్దామనుకున్నాను.


మరో కొద్దిరోజులకు శివయ్యగారు కనపడ్డాడుగాని నేనివ్వదలిచిన సలహా నా నాలుకమీదనే ఇగిరిపోయింది. ఎందుకంటే ఈసారి నాకు కనిపించినప్పుడాయన టాక్సీలో పోతూ నన్నుచూసి ఆగి, నన్నుకూడా ఎక్కించుకుని మా ఆఫీసుదగ్గిరదించి తనదారినతాను వెళ్ళాడు. మధ్యదారిలో నాకు శుభవార్తచెప్పాడు. ఆయన పెడతామనుకున్న కంపెనీ మర్నాడే రిజిస్టరు కాబోతోందిట!

ఈమాట వినగానే శివయ్యగారిచుట్టూ ఒక కొత్తకాంతి కనిపించినట్టయింది. టాక్సీకారు ఆ కాంతిని మరింత అధికంచేసింది. లోగడ ఆయననుగురించి హోటల్లో రాజేశ్వర్రావు అన్నమాటలూ, నేననుకున్న ఆలోచనలూ తుడిచేసుకుపోయాయి. శివయ్యగారి తపస్సు ఫలించింది. ఆయన సినిమాకంపెనీ పెట్టబోతున్నాడు. నేనుకూడా తనను ప్రోత్సహించినట్టు ఆయనే చెప్పుకొన్నాడుగనక ఈ కంపెనీ ద్వారా నాకేదైనా కాస్త ఆధారం లభించకపోదు—నోరు తెరిచి అడిగితే. వెనక్కుతిరిగి చూసుకుంటే నేనాయనను బాగానే ప్రోత్సహించినట్టు తోచింది. వొట్టి పుణ్యానికి ఆయనకు అటువంటి అభిప్రాయం ఎందుకు కలుగుతుంది? ఆ రాజేశ్వర్రావుతో పనిపెట్టుకుని ఎందుకు చెబుతాడు?

## 4

అధమం ఒకనెల గడిచివుంటుంది. నేను శివయ్యగారి మాట పూర్తిగా మరిచిపోయాను. ఒకవేళ జ్ఞాపకంవచ్చినా, ఆయన మద్రాసులో ఏదో ఒక పేటలో ఒక ఆఫీసుపెట్టి కుర్చీలో కూర్చున్నట్టు ఊహించుకుని ఉండేవాణ్ణి. కనుకనే ఆయన ఒకనాడు బెడ్డింగుతోసహా మా ఇంటికి వచ్చేసరికి నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను.

"రండి. లోపలికిరండి,'' అన్నాను. నామొహంలో ఆయనకేం భావంకనబడిందోకూడా నాకుతెలీదు.



"ఇశ్శో, రామ! అబ్బ! కాసిని మంచితీర్థం ఇప్పించు, బాబూ!"

మామూలు సపర్యల అనంతరం యోగక్షేమాలు విచారించాను. తెలుసుకోదగినంత పెద్ద కథ ఏమీలేదు, కంపెనీ రిజిస్టరుకాలేదు, నమ్మించిన పెద్దలు మోసంచేశారు. నష్టపోయింది శివయ్యకాదు—ఆయనదగ్గిర ఏమీలేదు నష్టపోవటానికి. శివయ్యగారంటే నాలాగే ఎంతోకాలంగా అనుభవం గల ధనికుడొకాయన కంపెనీ ప్రారంభించటానికి ముందు చేయదగిన ఖర్చులకు డబ్బిచ్చుకున్నాడు. అందులో కొంత నాకళ్ళయెదటే టాక్సీకింద ఖర్చయిందనుకోండి.

ఏమయితేనేం! శివయ్యగారు ఒక మెట్టెక్కి రెండు మెట్లుజారాడు!

"నాకు మరేం అవసరంలేదు. రాత్రిపూటవచ్చి యీ వరండాలో పడుకుంటాను. మీకేమీ శ్రమవుండదు!" అన్నాడాయన. దానికేం అభ్యంతరం ఉంటుందీ?

శివయ్యగారు ఉదయమే లేచి నిత్యకృత్యాలు తీర్చుకుని, బట్టలుకూడా తానే ఉతుక్కుని, స్నానంచేసి బయలుదేరేవాడు. మళ్ళా రాత్రిపొద్దు పోయివచ్చి బావిదగ్గిర కాళ్ళూ ముఖమూ కడుక్కునివచ్చి వరండాలో పడుకునేవాడు. నేను నిద్రపోకపోతే నాతో ఏవన్నా మాట్లాడేవాడు. ఈ మాట్లాడటంకూడా ఒక్కొక్కప్పుడు ఆశమీద జీవిస్తున్నవాడల్లేనూ, ఒక్కొక్కప్పుడు నిస్పృహ దెబ్బతిన్నవాడల్లేనూ మాట్లాడేవాడు. ఆయనదగ్గిర డబ్బున్నదో లేదో, లేకపోతే ఎవరిదగ్గిర పుచ్చుకొంటున్నాడో నాకుతెలీదు. ఆయనకు డబ్బిచ్చే తాహతు నాకులేదు. కాని రోజూ ఆయన ఏవేళప్పుడింటికి వచ్చినా, "భోంచేశారా?" అని మావాళ్లు తప్పక అడిగేవాళ్ళు. ఆయన తిన్నట్టు కనిపించకపోయినా, 'నాకీపూట ఆకలిగాలేదు.' అని సమాధానం చెప్పినా అప్పటికప్పుడు వండిఅయినాసరే భోజనంపెట్టేవాళ్ళు. సాధారణంగా ఆదివారాలూ, శలవురోజులూ నేనే బతిమాలి ఆయనను ఇంట్లో ఉంచేసేవాణ్ణి. బయటికిపోతే ఇద్దరమూ కలిసే వెళ్లేవాళ్ళం.

ఒక ఆదివారం, పాపం శివయ్యగారు తన పతనంలో ఒక సరికొత్తదశ బయటపెట్టాడు,

"చూడు, బాబూ, నాకేసినిమావాళ్ళయినా ఒకవేషం— ఏదైనాసరే—ఒకటి ఇస్తే బాగుండును. డబ్బుకూడా ప్రధానంకాదు. బొత్తిగా నిర్వ్యాపారంగా ఉండవలిసివస్తోంది. ఈ సినిమాలలో బోలెడన్ని వేషాలుంటున్నాయి, ఎంతో మంది నటిస్తున్నారు. వారిలో జమకాలేకపోతానా అని ధైర్యం." అన్నాడు శివయ్యగారు.

ఈయనకీగతా అన్నబాధ తప్ప ఆయనవున్న పరిస్థితులలో ఇది మంచి ఆలోచనగానే తోచింది. సినిమాలలో ఎక్స్ట్రావేషాలు వేసేవాళ్ళకికూడా బాగానేఇస్తారని విన్నాను. ఈయన మాటలుచెప్పగలడు. సినిమావాళ్ళకు పనికొచ్చే మాటుంటే పాడతాడుకూడా. ఆయన ఎంత కాదన్నా నాలుగుడబ్బులు కళ్ళబడితే మనిషి బొత్తిగా దిగజారిపోకుండా ఉంటాడు. రొట్టెలవాడికన్న ముక్కలవాడిపని హాయి అంటారు. ఈయనకు చిల్లరవేషాలిచ్చినట్టయితే నాలుగు పిక్చర్లలో ఒకేసారి నటించి నెలకు హీనంగా రెండు మూడు వందలు తెచ్చుకోవచ్చు. కాని ఒకటే చిక్కు. నేనెవర్నీ సినిమావాళ్ళని ఎరగను. నాయెరికలో సినిమావాళ్ళని ఎరిగినవాళ్ళెవరైనా ఉన్నారా అని ఆలోచించాను. ఒకరిద్దరు తట్టారు. వాళ్ళతో మాటవేశాను.

రోజులు గడిచాయి. పనిమాత్రం జరగలేదు. నాకు చెప్పకుండా శివయ్యగారొక చాదస్తం పనిచేశాడు. ఏదో పత్రికకు డబ్బిచ్చి అందులో తనబ్లాకు వేయించి తాను సినిమాలలో నటించటానికి సిద్ధంగావున్నట్టు రాయించుకున్నాడు. ఈ మంత్రానికైనా ఒక్క చింతపిందె రాలలేదు.

"ఇట్లాకాదు, బాబూ. అడగందీ అమ్మయినా పెట్టదు. నేనే ఈ సినిమాకంపెనీలకు వెళ్ళి వేషంఅడుగుతా. ఇంతలో మనకు పోయేప్రతిష్ట యేమిటి?" అన్నాడు శివయ్యగారు ఒకనాడు.

ఈ ఆలోచనను నేను బలపరిచి, ఈపని ముందే చెయ్యవలిసిందని చెప్పా. చివరకి ఫలించిందికూడా ఈయత్నమే. ఎవరో కంపెనీవారు చిన్నవేషం—రెండేషాట్లు—ఇచ్చారు. ఆ వేషానికి పదిహేనురూపాయిలిస్తామన్నారు. నాకేచాలా ఆనందమయింది. ఆపాటి సందు దొరికితే శక్తిసామర్థ్యాలు గలవాడు యెంతైనా విజయం సాధించవచ్చు.

దురదృష్టవశాత్తూ షూటింగుకు నేను పోలేకపోయాను. రాత్రి తొమ్మిదికి షూటింగు ప్రారంభమట. సాయంకాలం

అయిదుగంటలకే శివయ్యగారు బయలుదేరి స్టూడియోకు వెళ్ళాడు. ఆయన తిరిగివచ్చేసరికి నేను కారుహారన్ చప్పుడుకు లేచా. ఆరు కావస్తోంది.

శివయ్యగారు మామూలుమనిషిలాగా లేడు. మామూలుగావుండే బెట్టుకాస్తా పోయింది. నన్ను మొహమైనా కడుక్కోనివ్వకుండా నిలవేసి జరిగినదంతా చెప్పాడు.

"సినిమానటన ఒక నటనబోయ్? ఇంతింత ముక్కలు తీస్తారు. ఆనటనే వాళ్ళకి చాలా గొప్పలాగుంది. నేను డైరెక్టరుగారితో ముందుగాచెప్పా: 'అయ్యా, నన్ను చేసి చూపించనివ్వండి. మీకు నచ్చకపోతే మీరు చెప్పినట్లు చేస్తా,' అన్నా. "ఏదీ చెయ్యండి!" అన్నాడాయన. చేసిచూపించా. 'అద్భుతం! ఇంతనటన నేనెన్నడూ చూడలేదు,' అన్నాడాయన. సెట్టుమీద అందరూ నిర్ఘాంతపోయారనుకో." అన్నాడు శివయ్యగారు.

నాకు మళ్ళీ మబ్బులు కనిపించాయి. ఇంతకీ ఈయన వేసినవేషం రాజభటుడివేషం. కథానాయకుడు పారిపోతూంటే పట్టుకుని దెబ్బతిని పడిపోతాడు. ఈయనకున్న మాటలల్లా "పట్టుకోండి, పట్టుకోండి!" అని. పాపారాయుడూ, బాహుకుడూ, అర్జునుడూ వేషిన మనిషి ఈ వెధవవేషంగురించి ఎందుకింత తబ్బిబ్బయిపోవాలి?

"కంపెనీ మంచిదిలెండి. వాళ్ళకు నిజంగానచ్చితే ఇంకా మంచివేషాలే ఇస్తారు." అన్నాను.

"నిజమేనంటావా? నిజంగా ఈ సినిమాలలో నటించటానికి ఎంత చాతకానివాళ్ళు వస్తారోయ్! నాతోపాటు మరొకడున్నాడు. ఎందుకూ పనికిరాడు. వాడికి మాటలున్నై. నోటపలికితేనా? చూడు చిత్రం. ఆ మనిషి ఏడెనిమిది పిక్చర్లలో చిల్లరవేషాలు వేస్తున్నాట్ట. ఒక్కోనెల ఏడెనిమదివందలుకూడా సంపాదిస్తాట్ట. వాడేచెప్పాడు."

"ఐతే ఆపాటిచాన్సు మీకూ వుంటుంది," అన్నాను.

ఆ సాయంకాలం నేనుకూడా శివయ్యగారివెంట కంపెనీకి వెళ్ళాను. ఆయన డబ్బుతీసుకోవటానికి వెళ్ళితే నేను తోడువెళ్ళానన్నమాట. మాకు ప్రొడక్షన్ మేనేజరు



గారి దర్శనమయింది. శివయ్యను చూడగానే ఆ మనిషి, “డబ్బుకోసమేనా బాబూ, తీసుకో, నీమూలంగా వెయ్యి రూపాయిలు దండగయింది. ఈ పదిహేను లెక్కా, జమా?” అని నాకేసితిరిగి, “ఈ పెద్దమనిషి చూడండి. స్టేజిమీద ఏమిటో పొడిచేశానంటాడు. రెండు ముండమోపిషాట్లు చెయ్యలేకపోయాడు. నిన్నతీసినషాట్లు మళ్ళీ ఇవాళ తీసుకొంటున్నాం—ఇంకోర్ని పెట్టి. ఏమిటో, సినిమాలంటే అందరికీ లోకువే....ఇందు. ఇక్కడ సంతకంపెట్టి పో, బాబూ. రాం, రాం!” అన్నాడు.

ఈ ప్రొడక్షన్ మేనేజరు మాటల్లో ఉన్న కాఠిన్యం గొంతులో ఏమాత్రమూలేదు. భోజనంలో కూరలో వుప్పు తక్కువైతే ఆ విషయం ఎట్లాచెబుతాడో పైమాటలన్నీ అదేధోరణిలో చెప్పాడు.

శివయ్యమొహాన మాత్రం కత్తివాటేస్తే నెత్తురుచుక్క లేదు. మూడు అయిదురూపాయలనోట్లు తీసుకునేటప్పుడు చెయ్యివొణికింది. ఏభాషోకూడా తెలియకుండా రసీదుమీద సంతకంపెట్టాడు. ఇంటికివచ్చాం. దారిపొడుగునా ఆయన ఏమీ మాట్లాడలేదు. నేను సినిమావిషయాలు మానేసి మిగిలిన విషయాలు మాట్లాడాను. ఆయన నామాటలకు ఊకొట్టి ఊరుకున్నాడు.

ఆరాత్రి నాతోకూడా ఆయన భోంచేశాడు. వరండాలో పడుకున్నాడు. మర్నాడు నేను నిద్రలేచేసరికి లేడు. ఎక్స్‌ప్రెస్‌కు తిరిగిపోతున్నాని మావాళ్ళతో చెప్పాట్ట.

పిచ్చిబ్రాహ్మడు ఏదైనా అఘాయిత్యం చేస్తాడేమోనని నాకు భయంవేసింది. నేను త్వరత్వరగా కాలకృత్యాలు తీర్చుకుని బస్సుమీదపడి సెంట్రల్ స్టేషనుకు వెళ్ళాను. ఎక్స్‌ప్రెస్ బయలుదేరటాని కింకా పావుగంట ఉంది. ప్లాట్‌ఫారం టిక్కెట్టు తీసుకుని లోపలికి వెళ్ళాను. కొద్ది ప్రయాసతో శివయ్యగారిని పట్టుకున్నాను.

“నువుకూడా వచ్చావుటోయ్? ఎందుకూ శ్రమా?.... అన్నట్టు, ఒక్క ఉపకారం చెయ్యగలవూ? ఆ పిక్చరు డైరెక్టరుగారున్నాడే, ఆయనతో మాటవరసకు అడిగినట్టుగా అడుగూ—నా నటనగురించి ఆయన అభిప్రాయమేమిటో! ఆ ప్రొడక్షన్ మానేజరు మాటలు నమ్మలేకుండా ఉన్నా!” అన్నాడు శివయ్యగారు.

“ఎందుకండీ? అతను వొట్టి హాస్యగాట్ట. పెద్ద తారలతోనే అట్లా మాట్లాడతాట్ట!” అన్నా.

శివయ్యగారి ముఖం వికసించింది.

“నేను తెలుసుకోలేకపోయాను సుమా! ఇదుగో చూడూ—” ఆయన వాక్యం పూర్తిచేసేలోపుగా గంట కొట్టారు, గార్డు ఈలవేశాడు. మరికాస్సేపట్లో ఎక్స్‌ప్రెస్ కదిలి పోయింది.

